క్లుప్తంగా

గడ్డివాము దగ్ధం



అయిజ: మండలంలోని ఉప్పల క్యాంప్‌లో గురువారం అర్ధరాత్రి ఓ గడ్డివాము దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు బడేసాబ్‌కు చెందిన గడ్డివాముకు నిప్పంటించడంతో గడ్డివాము మొత్తం కాలిపోయింది. గ్రామస్తులు గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌తో నీళ్లు చల్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరికి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుజేశారు. అయితే అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. గడ్డి వాము విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



అలంపూర్: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. అలంపూర్ శివారులోని తుంగభద్ర నదిలో ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెళ్లి తనిఖీలు చేయగా డ్రైవర్ ట్రాక్టర్‌ను వదిలేసిపోయాడన్నారు. దీంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

మానవపాడు: సీజనల్ వ్యాధులతో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ యాకుబ్ బాషా సూచించారు. మండల కేంద్రంలోని ఆశాలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైన దగ్గు, జ్వరంతో బాధపడుతుంటే డెంగ్యూ, మలేరియా పరీక్షలు చేయించాలన్నారు. అలాగే పరిసరాల, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలి

గట్టు : గట్టు గ్రామంలో గత మూడు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఏర్పాడ్డాయి. మిషన్ భగీరథకు సంబంధించిన వాటర్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వడ్డేగేరి, బండమీదగేరి, చేనేత కాలనీ వాసులు తెలిపారు. కస్తూర్బా పాఠశాల దగ్గర ఉన్న వాటర్ ట్యాంకు దగ్గర ట్యాంకు నుంచి బయటకు వెళ్లే నీటి పైపు లైన్ వాల్ పని చేయకుండా పోవడంతో నీటి సమస్య నెలకొందని అధికారులు స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

నేడు మండల కేంద్రానికి శాస్త్రవేత్తలు

మానవపాడు: మండల కేంద్రానికి శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు రానున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 9గంటలకు రైతులతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని రైతులు పంటలలో చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే ఇతర సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మాణాల పరిశీలన

మానవపాడు: మండలంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ భాస్కర్ గురువారం పరిశీలించారు. చంద్రశేఖర్‌నగర్‌లోని పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న ఇళ్లను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

అమరచింత: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం తహసీల్దార్ రవికుమార్ యాదవ్‌తో కలిసి డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ 28 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను అందించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇందిరమ్మ ఇళ్లను అందిస్తారన్నారు.

హరితహారం మొక్కలు.. బుగ్గిపాలు





నీలిపల్లి స్టేజీ వద్ద అగ్నికి ఆహుతైన మొక్కలు

మల్దకల్: పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి హరిత లక్ష్యంపై ప్రజలకు అవగాహన సైతం కల్పించింది. ఏటా లక్షలాది మొక్కలు నాటుతూ వాటి సంరక్షణకు రూ.కోట్ల ప్రజాధనాన్ని కూడా ఖర్చు చేస్తుంది. అయితే ఇంత చేస్తున్నా మొక్కల సంరక్షణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో హరితహారం లక్ష్యం నెరవేరడం లేదు.

రైతులకు అవగాహన కల్పించాలి

హరితహారంపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో రహదారుల సమీపంలో నాటిన మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నాయి. రైతులు తమ పొలాల్లోని చెత్తా చెదారాన్ని రోడ్ల పక్కన వేసి నిప్పంటిస్తున్నారు. దీంతో పల్లెల నుంచి పట్టణాల వరకు రహదారుల వెంట నాటిన మొక్కలు అగ్గిపాలవుతున్నాయి. మల్దకల్ మండలంలోని ఎల్కూరు, మల్దకల్ గ్రామాల మధ్యన నీలిపల్లి స్టేజీ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా మూడేళ్ల క్రితం మొక్కలు నాటారు. పంచాయతీ సిబ్బంది ట్యాంకులతో మొక్కలకు నీరు పోసి వాటిని సంరక్షిస్తున్నారు. అయితే ఎవరి నిర్లక్ష్యమో ఏమో కానీ రోడ్డుపక్కన ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మూడేళ్లుగా కాపాడుతూ వస్తున్న మొక్కలు పదుల సంఖ్యలో అగ్గికి ఆహుతయ్యాయి. హరిత లక్ష్య సాధనకు ఏళ్లుగా సిబ్బంది పెట్టిన శ్రమ ఒక అగ్గిపుల్లతో బుగ్గిపాలయింది. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా రహదారులకు ఇరువైపులా ఉన్న పంట పొలాల రైతులకు అవగాహన కల్పించడంతో పాటు రైతులకు మొక్కల సంరక్షణ బాధ్యతలు అప్పగించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



సమ్మర్ క్లాసులను పరిశీలించిన ఎంఈఓ

కేటీదొడ్డి: మండల పరిధిలోని నందిన్నె ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకటేశ్వర్ రావు అన్నారు. గురువారం 6, 7, 8 తరగతుల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సమ్మర్ క్లాసులు ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శివరాజ్, తదితరులు ఉన్నారు.

ధరూరు: మండల పరిధిలోని రేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రవీంద్ర బాబు అన్నారు. రేవులపల్లి సమ్మర్ క్యాంపును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్యాంపులో చెప్పే అన్ని విషయాలు శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా స్పోకెన్ ఇంగ్లీష్, గణితం, డ్రాయింగ్, యోగాను నేర్చుకొని ప్రతి ఒక్క విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ తిమ్మారెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



రాజోళి: ఈ నెల 20న తేదీన చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను సంబంధించి మండల ప్రత్యేకాధికారి ఖాజావలికి కేవీపీఎస్ నాయకులు, సీఐటీయూ నాయకులు గురువారం సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు, ఇతర డిమాండ్ల సాధనకు చేస్తున్న ఈ సమ్మెకు అంగన్‌వాడీ, పంచాయతీ కార్మికులు, వీఆర్‌ఏలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. తమ డిమాండ్ల పరిష్కారానికి చేపట్టిన సమ్మెను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్‌కుమార్, లక్ష్మన్న, మహేష్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయుడు పరామర్శ



టీడీపీ నేతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ : అయిజ మున్సిపాలిటీకి చెందిన టీడీపీ నేత అంజీ గుండె సంబంధిత సమస్యతో కర్నూల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు ఆసుపత్రికి వెళ్లి అంజీని పరామర్శించారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన



కేటీదొడ్డి: మండల కేంద్రంలోని బుధవారం రాత్రి కర్రెమ్మ, మాశమ్మ జాతర సందర్భంగా చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు సాయి సాకేతన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతులు హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నారుల డ్యాన్స్‌ను తిలకించి వారిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్, జంబురామన్‌గౌడు, రాజశేఖర్, రామకృష్ణనాయుడు, ఉరుకుందు పాల్గొన్నారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

గట్టు : మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే అందాల పోటీలను రద్దు చేయాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద పిలుపునిచ్చారు. గురువారం గట్టులో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో నర్మద మాట్లాడుతూ.. దేశంలో మహిళలపై రోజు రోజుకు దాడులు, దారుణాలు పెరిగిపోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలను అరికట్టాల్సిన ప్రభుత్వం , అందాల పోటీలకు నిర్వహిస్తుండడం దారుణమన్నారు. మహిళలను అంగట్లో సరుకుల్లా మార్చి దాడులను పెంచిపోషించే అందాల పోటీలు నిర్వహించడం సరికాదన్నారు. వరంగల్‌లో అందగత్తెల కాళ్లను కడిగించడం బానిసత్వాన్ని గుర్తు చేస్తున్నట్లు ఉందని ఆరోపించారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే అందాల పోటీలను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా సంఘం జిల్లా కమిటీ సభ్యులు జయమ్మ, రాధ, గోవిందమ్మ, నర్సమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల కోసం పడిగాపులు

- మండలంలో రూ.7.63 కోట్లు పెండింగ్
- రైతుల ఇక్కట్లు
- కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు



దావాజిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు



పాన్‌గల్ కేంద్రంలో ధాన్యం కాంటా చేస్తున్న హమాలీలు (ఫైల్)

పాన్‌గల్: యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై నెల రోజులు దాటినా డబ్బులు రెగ్యూలర్‌గా అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వ్యాపారులకు చెల్లించేందుకు, ట్రాక్టర్ కిరాయి, వరి కోతకు, హమాలీలకు, ఇతర పెట్టుబడులు చెల్లించలేక అగచాట్లు పడుతున్నారు. ధాన్యం కాంటా చేసిన వెంటనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెబుతున్నా వారి హామీలు అమలు కావడంలేదు. ధాన్యం కాంటా చేసి 20 రోజులు దాటినా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. దీంతో బ్యాంకు, సింగిల్ విండో, ఐకేపీ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నారు.

ధాన్యం సేకరణలో జాప్యం

మండలంలోని చాలా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతుండటంతో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు అవుతున్నా కాంటా చేయకపోవడంతో ధాన్యం కాపాడుకోవడం ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలు సంభవిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని, అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కాంటా వేదుకుంటున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లో 6వేల బస్తాలు, సింగిల్ విండో ఆధ్వర్యంలో 15 వేల బస్తాల ధాన్యం నిల్వలు పేరుకపోయాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

మండలంలో..

కొనుగోలు కేంద్రాలు	రైతులు	సేకరించిన ధాన్యం	చెల్లించాల్సిన డబ్బులు
14 కేంద్రాలు (ఐకేపీ)	285	17,061 క్వింటాళ్లు	రూ.2.45 కోట్లు
23 కేంద్రాలు (సింగిల్‌విండో)	473	83,800 క్వింటాళ్లు	రూ.5.18 కోట్లు
			మొత్తం: రూ.7.63 కోట్లు

నెల రోజులైనా కాంటా లేదు



వరి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి నెల రోజులైనా నేటికీ కాంటా చేయకపోవడంతో కేంద్రంలోనే పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తేమ శాతం వచ్చినా.. లారీలు రావడం లేదని సేకరణలో జాప్యం చేస్తున్నారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం కాపాడుకోవడం ఇబ్బందిగా మారింది.

– లక్ష్మీదేవమ్మ, తెల్లరాళ్లపల్లి

డబ్బులు జమ కాలేదు



సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి 15 రోజులు అవుతున్నా డబ్బులు నేటికీ ఖాతాలో జమకాలేదు. దీంతో డబ్బుల కోసం ప్రతి రోజు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– తిరుపతిరెడ్డి, పాన్‌గల్

ఉన్నతాధికారులకు నివేదించాం



రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన వివరాలను జిల్లా అధికారులకు నివేదించాం. మా సొసైటీ ద్వారా సేకరించిన ధాన్యానికి సంబంధించి 473 మంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. వారిలో ఇప్పటి వరకు 200 మందికి రూ.3 కోట్ల వరకు ఖాతాల్లో జమ చేశాం. మిగితా రైతులకు సంబంధించి రూ.5.18 కోట్లు ఒకటి, రెండు రోజుల్లో జమ అవుతాయి.

– భాస్కర్‌గౌడ్, పీఏసీఎస్, సీఈఓ, పాన్‌గల్

పట్టణ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అయిజ: మున్సిపాలిటీలోని మడ్డి గుంత కాలనీలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కాలనీ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎం ప్రమీల కాలనీ ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు లక్ష్మీదేవి, సుజాత, జ్యోతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏఓ నాగార్జున్ రెడ్డి

అలంపూర్: రైతులు ప్రకృతి వ్యవసాయానికి సిద్ధం కావాలని మండల వ్యవసాయ అధికారి నాగార్జున్ రెడ్డి అన్నారు. అలంపూర్ మండలంలోని లింగనవాయి, బుక్కాపురం గ్రామాల్లో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంలో భాగంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రకృతి వ్యవసాయం మంచిదన్నారు. ఈ పథకం కింద మండలంలో లింగనవాయి, బుక్కాపురం గ్రామాలను ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఒక క్లస్టర్‌లో 125 మంది రైతులు 50 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం చేయడానికి వీలుగా రైతులకు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నీలిమ, శిరీష, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

మానవపాడు: ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇతర పత్రాలను పరిశీలించారు.వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని మద్యం సేవించి బైక్ నడిపినా, బైక్‌పై ముగ్గురు ప్రయాణించినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఇటిక్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. గురువారం మండల పరిధిలోని కోదండాపురంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి ఏర్పాటు చేసిన మండల కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అంతా అవకతవకలుగా ఉందన్నారు. ఇళ్ల ఎంపికలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను మాత్రమే గుర్తిస్తూ నిజమైన అర్హులకు తీవ్ర అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి అర్హులందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేకే రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, షేక్ అబ్దులా, నరసింహులు, మల్లేష్, మహింద్రా, రాజు, శివ, పరుశురాం పాల్గొన్నారు.

సురవరం సుధాకర్ రెడ్డిని కలిసిన నాయకులు



సుధాకర్ రెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

ఉండవెల్లి: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు సీపీఐ జాతీయ నేత సురవరం సుధాకర్ రెడ్డిని కలిశారు. తన స్వగ్రామమైన మండలంలోని కంచుపాడు గ్రామంలో ఆయనను కలుసుకొని పరామర్శించారు. సురవరం సుధాకర్ రెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈక్రమంలో గురువారం ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అతని కుమారుడు ఏఐఎమ్‌ఎఫ్ వ్యవస్థాపకులు కపీల్, ఎర్రవలి రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న జీఎస్ గోపి

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్తున్న రైతు కూలీలకు ఉపాధి కల్పించాలని, వారికి ఏడాదికి రూ.12,500 చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర చెరుకు సంఘం అధ్యక్షుడు జీఎస్.గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ఈ నెల 20 జరిగే సార్వత్రిక సమ్మెకు ప్రతి శ్రామికుడు, కూలీలు సంపూర్ణంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ గురువారం మండలంలోని కొంకన్‌వానిపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఉపాధి హామీ కూలీలతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు రకం వరిధాన్యానికి కూడా బోనస్‌గా రూ.500 చెల్లించాలని కోరారు. మిల్లర్లు తేమ, తాలు, చెత్త పేరుతో క్వింటాకు 8 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్, హమాలీ వ్యవస్థను ఏర్పాటు చేయ్యాలని కోరారు. అకాల వర్షాల కారణంగా రైతులు ధాన్యాన్ని కాపాడుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేష్, అంజిరెడ్డి, మొగిలన్న, మోహన్, నాగరాజు పాల్గొన్నారు.

జేపీఎల్‌ను విజయవంతంగా నిర్వహిస్తాం



టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న జాంద్ర యువజన సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పట్టణ జాంద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జాంద్ర ప్రీమియర్ లీగ్ (జేపీఎల్-3) నిర్వహిస్తున్నట్లు పట్టణ జాంద్ర యువజన సంఘం ప్రతినిధులు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత మూడేళ్లుగా జాంద్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జేపీఎల్-3లో 21 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర జాంద్ర సంఘం అధ్యక్షులు బుగిడి అనూప్, తదితరులు హాజరవుతారని తెలిపారు. ఓపెన్‌స్థాయిలో స్థానిక కుర్విని శెట్టికాలనీలోని జాంద్ర కమ్యూనిటీ హాల్లో నేటి నుంచి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 40 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం జేపీఎల్-3కి సంబంధించిన టీషర్ట్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో పట్టణ జాంద్ర యువజన సంఘం అధ్యక్షులు సడ్డె పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి టంకశాల మల్లేష్, కోశాధికారి పోతినెపల్లి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు దోమ సాయికుమార్, నాగలి విశ్వకాంత్, సంయుక్త కార్యదర్శులు వన్నాడ అనిల్‌కుమార్, గడిగె చంద్రశేఖర్, కనికె పవన్‌కుమార్, బుట్టా అవినాష్, ప్రచార కార్యదర్శి ముచ్చర్ల శ్రీశైలం, కనికె శివకుమార్ పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్‌కు బాటలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): చదువుతోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని శ్రీకరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుకాడి శ్యాంసుందర్ అన్నారు. శ్రీకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కమల గార్డెన్‌లో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15ఏళ్ల నుంచి తమ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో పని చేసిన కరోనా వారియర్స్ మున్సిపల్, ఆరోగ్య సిబ్బందిని సన్మానించినట్లు తెలిపారు. తనకు సహకరించే వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వాగ్దేవి కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, లక్ష్మన్‌గౌడ్, ట్రాస్మ లక్ష్మణ్, సంతోష్, భానుచందర్, విష్ణు ప్రణీత, శ్రీకరి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.